క్లుప్తంగా

అల్లూరులో గ్రామసభ



వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం అల్లూరు గ్రామ సచివాలయ కార్యాలయంలో సర్పంచి బందెల రాణి అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. ఈ గ్రామసభలో 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఏపీఓ నల్లాని జనార్ధన్ తెలిపారు. ఇప్పటి వరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించామని అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు నివేదికలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్పీ సూర్యనారాయణ, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



మక్కపేట(భీమవరం): చిల్లకల్లు వైరా రహదారిలో ఉన్న మూడు ఈనెల రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఈ రహదారి గుండా వెళ్లే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఇదే రహదారిలో గుట్టపై నరసింహస్వామి ఆలయం కూడా ఉంది. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ప్రధాన రహదారి వద్ద వాహనాలను నిలిపి అక్కడ నుంచి కాలినడకన వెళ్తున్నారు. గతంలో ఈ రహదారి బాగానే ఉంది. నరసింహస్వామి గుట్టకు ఆనుకుని మరో రెండు గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టలను పెద్ద ప్రొక్లయిన్‌లను ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా మట్టిని తొలగిస్తున్నారు. మట్టిని తరలించేందుకు పెద్ద ట్రిప్పర్లు తిరుగుతుండటంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వత్సవాయి: మోకాళ్ల ఆపరేషన్ నిమిత్తం రూ. 2,17,200 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అందజేశారు. వత్సవాయికి చెందిన బిట్ర నాగమణి మోకాళ్ల నొప్పులతో బాధపడుతుంది. తన ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరగా ఆమెకు రూ. 2,17,200 ప్రభుత్వం మంజూరు చేసింది. సదరు చెక్కును ఎమ్మెల్యే వారికి అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



జగ్గయ్యపేట: పట్టణంలోని సీతారాంపురంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో మంగళవారం నందిగామ చర్చి ఆఫ్ క్రైస్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పైడిపల్లి మణి ఆనంద్, దేవ సహాయం, సిబ్బంది రత్న వినోద్, మున్నా, హెచ్ఎం శివరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెండ్యాలలో గ్రామ సభ

కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామంలో బుధవారం భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి. జాహ్నవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూముల్లో కొలతలు, హద్దుల్లో తేడాలుంటే గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఖచ్చితమైన కొలతలు, హద్దులతో భూములను రీ సర్వే చేయడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

సీఐడీ సోదాలు

కంచికచర్ల: కంచికచర్ల మండలం గండేపల్లి సెంటినీ బయో ప్రొడక్ట్ కర్మాగారంలో సీఐడీ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి కర్మాగారంలో రికార్డులను పరిశీలించారు. బేవరేజ్‌లో మద్యం విక్రయాలు ఏవిధంగా ఉన్నాయి. ధరల వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. అయితే సోదాలు చేస్తున్న విషయాలపై సమాచారం చెప్పేందుకు అధికారులు నిరాకరించారు. సోదాల్లో సీఐడీ అధికారులు, ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అప్రఫున్నీసా బేగం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం పరిహాసమేనా?

- గత నెలలో పాలేటి వరదలకు రెండు గ్రామాల్లో నీట మునిగిన ఇళ్లు
- కొందరికే పరిహారం అందజేత
- నేటికి పూర్తిస్థాయిలో అందని సాయం

బూదవాడ(జగ్గయ్యపేట): గత నెలలో సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా గ్రామంలోని పాలేరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలతోపాటు శివారు గ్రామం రెడ్డినాయక తండాను వరద నీరు చుట్టుముట్టింది. పలు ఇళ్లల్లోకి వరదనీరు చేరి విలువైన సామాన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు రేకులషెడ్లు, ప్రహరీ గోడలు కూలిపోయి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వరద తగ్గిన తర్వాత ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. వరద కారణంగా నష్టపోయిన తమకు నష్టపరిహారం నేటికి అందలేదని.. కొందరికి మాత్రమే అందించారని ప్రభుత్వం మాపై చిన్నచూపు చూస్తోందంటూ పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వేతో చేతులు దులుపుకొన్నారు

వరద అనంతరం రెవెన్యూ అధికారులు గ్రామంతో పాటు శివారు గ్రామంలో పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మొత్తం 508 ఇళ్లకు నష్టం వాటిల్లిందంటూ సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే 45 రోజులు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో వరద బాధితులకు నష్టపరిహారం అందలేదు. కొందరికి మాత్రమే నష్టపరిహారం అందించారు. బూదవాడ, రెడ్డినాయక తండాల్లో పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న 32 ఇళ్లకు మాత్రమే రూ. 10 వేలు చొప్పున నష్టపరిహారం అందించారు. మిగిలిన 476 ఇళ్లల్లోకి నీరు చేరి నష్టపోయిన బాధితులకు నేటి వరకు పరిహారం అందించలేదు.



రెడ్డినాయకతండాలో ఓ ఇంటి వద్ద కూలిన ప్రహరీగోడ

ప్రభుత్వం ఆదుకోవాలి

వరద బాధితులకు ప్రభుత్వం నుంచి నిత్యావసర వస్తువులు మాత్రమే అందజేసి చేతులు దులుపుకొన్నారు. వారం రోజులపాటు ఇళ్లల్లో వరద నీరు, బురద ఉండటంతో బాధితులు అనేక ఇబ్బందులు పడ్డారు. అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం పునరావాసం కల్పించడంతో పాటు తాగు నీటి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



పాలేరుకు వరద సమయంలో ఇళ్లల్లోకి వచ్చిన నీరు (ఫైల్)

విలువైన సామాన్లు దెబ్బతిన్నాయి



పాలేరుకు ఉధృతంగా వరద రావడంతో మా ఇంట్లోకి నీరు చేరి విలువైన వస్తువులన్నీ దెబ్బ తిన్నాయి. అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లారు. కానీ నేటి వరకు నష్టపరిహారం అందలేదు.

– పోలె స్వరూప, బూదవాడ

షెడ్డు కూలిపోయింది...



వరద సమయంలో మా పశువుల షెడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంట్లోకి నీరు రావడంతో వస్తువులు పనికి రాకుండా పోయాయి. నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదు.

– కె. వెంకటేశ్వరరెడ్డి, రెడ్డినాయక తండా

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఇళ్లల్లోకి వరద నీరు చేరిన వివరాలను పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. అంతే కాకుండా పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లలకు కూడా నష్టపరిహారం వారి ఖాతాలకే జమ చేసింది.

– ఎస్. నాగరాజు, తహసీల్దార్, జగ్గయ్యపేట

ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో ప్రతిభ



జగ్గయ్యపేట: ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరలో మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన లింగనబోయిన హనుమంతరావు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలోని బుద్ధం కన్వెన్షన్ హాల్‌లో ప్రపంచ తెలుగు కళా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా 24గంటల పాటు అనర్గళంగా హనుమంతరావు కవితా గానం చేశారు. దీంతో ఆయనకు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు జ్ఞాపికను నిర్వాహకులు అందజేశారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

నందిగామ టౌన్: కృష్ణా, గుంటూరు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయిపాలెంలో మంగళవారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసి కృష్ణాజిల్లా పరిధిలో నివసించే వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నవంబర్ 6వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఇద్దరు టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చివరకు ఆందోళన వరకు దారి తీసింది. గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ నాయకులు మాదినేని విక్రమ్, నూతలపాటి కృష్ణకు మధ్య వ్యక్తిగత కారణాలతో ఘర్షణ జరగగా మంగళవారం కృష్ణ వర్గీయులు తమకు న్యాయం చేయాలంటూ పాత సినిమా హాల్ సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అక్కడకు చేరుకుని వారితో మాట్లాడారు. దీంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

24, 25న కబడ్డీ టోర్నమెంట్

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో జేఎన్‌టీయూ–కే సెంట్రల్ జోన్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ–కే పరిధిలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో 47 టీములు పాల్గొంటాయని పీడీ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

జగ్గయ్యపేట డివిజన్‌లో 31 సంఘాలకు నవంబర్‌లో ఎన్నికలు

పెనుగంచిప్రోలు: సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. దీనికి సంబంధించి తొలి నోటిఫికేషన్ వచ్చింది. సాగునీటి సంఘాల్లో సభ్యులుగా చేరిన రైతులు ఆయా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. వారు సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ప్రతి డీసీ పరిధిలో ఉండే సాగునీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. జగ్గయ్యపేట డివిజన్ పరిధిలోని సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న సాగునీటి సంఘాలు, చెరువులు, మునేరు కింద ఉన్న సాగునీటి సంఘాల ఎన్నికలకు కూడా అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఆయా సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ప్రత్యేకంగా అధికారుల నియామకం కూడా చేపట్టనున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఎన్నికలు జరుగుతున్నాయి.



డివిజన్ పరిధిలోని సాగర్ కాలువ

నోటిఫికేషన్ విడుదలైంది

సాగునీటి సంఘాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రక్రియ మొదలైంది. సాగర్ ఎడమ కాలువ పరిధిలోని జగ్గయ్యపేట డివిజన్‌లో 31 నీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో ఒకొక్క సంఘానికి 12 మంది చొప్పున సభ్యులు ఉంటారు. ఎన్నికలకు సంబంధించి పులిచింతల ఎస్ఈ నోడల్ అధికారిగా ఉంటారు. ఎన్నికలకు సంబంధించి ఇతర అధికారుల నియామకం కూడా జరుగుతుంది.

– సంతోష్, ఎన్ఎస్‌పీ ఈఈ

ఎలుకల నివారణపై దృష్టి సారించాలి

భీమవరం(వత్సవాయి): వరి పంటను సాగుచేస్తున్న రైతులు ఎలుకల నివారణపై దృష్టి సారించాలని ఏడీఏ భవాని తెలిపారు. గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలుకలు ఉన్నట్లు గుర్తించాలంటే ముందుగా పొలంగట్లను పరిశీలించి.. దానికి బొరియలు ఉన్నాయా లేవా అన్నది చూసుకోవాలి అన్నారు. ఎలుకలు ఉన్నట్లయితే వాటి నివారణ బ్రోమోడయోలోన్ అనే మందును పొట్లం కట్టి బొరియల్లో వేసి మట్టితో కప్పివేయాలని సూచించారు. ఎలుకల నివారణను అశ్రద్ధ చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వి. రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

చంద్రగూడెం(మైలవరం): పంట పొలాల్లో ఎలుకల ఉధృతిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ. శారద అన్నారు. చంద్రగూడెంలోని రైతు సేవా కేంద్రంలో బ్రోమోడయోలోన్ ఎలుకల మందును ఉపయోగించి సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శారద మాట్లాడుతూ ఎలుకలను సామూహికంగా నివారించినప్పుడు మాత్రమే వాటి వల్ల కలిగే నష్టాన్ని అరికట్టవచ్చని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఎస్. నాగమణెమ్మ మాట్లాడుతూ ప్రతి ఎలుక కన్నం వద్ద 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పెట్టాలన్నారు. ఎలుకల బొరియలలో పొట్లం పెట్టి ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఏఎస్‌బీ అనితాభాను, ఏఓ టెక్నికల్ వి. ఊర్మిళ, మండల వ్యవసాయాధికారి కె.సంధ్యారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని వెల్వడం, పొందుగల తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో రైతు భరోసా కేంద్రాల వ్యవసాయాధికారులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.



భీమవరంలో వరి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భవాని

క్రీడలకు అత్యంత ప్రాధాన్యత

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి పాఠశాలల అండర్–14, అండర్–17 కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు దాసరి శ్రీనివాసరావు, మురుకుంట్ల శ్రీనివాసరావు, నియోజకవర్గ కన్వీనర్ గంటా వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వరరావు, నాయకులు పితాని శ్రీనాథ్, చిట్టూరి రమేష్, చెన్న బాలకృష్ణ, కట్ట నవీన్, హెచ్ఎం మాధవీలత, వివిధ పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

60 మంది ఎంపిక

పేట బాలుర హైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలో అండర్–14 బాలికలు 15 మంది, బాలురు 15 మంది, అండర్–17 బాలికలు 15 మంది, బాలురు 15 మంది కలిసి మొత్తం 60 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారు ఈనెల 26న అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్థాయి (మెన్, ఉమెన్) పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డి. రామ్‌కుమార్ 375 కిలోలు బరువు ఎత్తి బంగారు, సిల్వర్ పతకాలు, కేకే సిద్ధార్థ 370 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం, టి. గోపీచంద్ 350 కిలోల బరువు ఎత్తి సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీ రాజ్‌కుమార్, జిమ్ కోచ్ ఎస్. నటరాజు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అభినందించారు.

ఉద్యోగాలు ఊడినట్టే.!

- నూతన మద్యం పాలసీతో పాత సిబ్బంది కనుమరుగు
- ఉపాధి కోల్పోయిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, వాచ్‌మెన్లు
- రెండు నెలల నుంచి వేతనాలు అందక అవస్థలు
- భరోసా కల్పించాలని వేడుకోలు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసిన సిబ్బంది ఉద్యోగాలు ఊడినట్టేనని పిస్తోంది. ఇటీవల ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. అయితే కూటమి నాయకులు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసిన సిబ్బందికి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. కానీ దుకాణాలు టీడీపీ నాయకుల చేతికి వెళ్లిపోగానే ఇప్పటివరకు మద్యం దుకాణాల్లో పనిచేసిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఇంటి బాట పట్టారు. కొత్తగా వేలంలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారులు వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. ఇప్పటివరకు పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వం రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదు. దీంతో వారంతా మనస్థాపం చెందుతున్నారు. ఇప్పుడు ఆ సిబ్బంది రోడ్డున పడ్డారు.

600మంది ఉపాధి కోల్పోయారు

నిన్నటి వరకు జిల్లాలో ఉన్న 133మంది మద్యం దుకాణాల్లో 600 మంది వరకు సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్‌లుగా పనిచేశారు. వీరిలో సూపర్‌వైజర్‌కు రూ. 19,500లు, సేల్స్‌మెన్‌కు రూ. 16,500, వాచ్‌మెన్‌కు రూ. 10వేలు వరకు జీతం ఇచ్చారు. వారందరికీ ప్రతినెలా 4వ తేదీలోగా జీతాలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. సకాలంలో జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు.



కంచికచర్ల మండలం కీసరలో నూతన మద్యం దుకాణం

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వం

నందిగామ నియోజకవర్గ ఎక్సైజ్‌శాఖ పరిధిలో 23 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ఎక్సైజ్ శాఖ పరిధిలో కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాలున్నాయి. గత ప్రభుత్వం ఎక్కడా అవినీతికి తావులేకుండా ఉండేందుకు సర్కారు మద్యం దుకాణాలను నిర్వహించింది. ఆ సమయంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు, తదితర సిబ్బంది పనిచేసేలా నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. కొత్త మద్యం పాలసీ రావడంతో ప్రభుత్వం వీరిని రోడ్డున పడేసింది. వీరికి కూటమి ప్రభుత్వం ఉపాధి లేకుండా చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్సైజ్, పోలీస్, వివిధ శాఖలకు చెందిన అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారికి మాత్రం ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించలేదు. దీంతో ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారు. ఉపాధి కోల్పోయిన వారంతా రేపటి నుంచి ఎలా జీవనం సాగించాలో అనే ఆలోచనలో పడ్డారు. చాలామంది కంటతడి పెట్టుకుంటూ ఎక్సైజ్ శాఖ అధికారులకు రికార్డులు, స్టాకు వివరాలు అప్పగించారు. ఇక మా తల్లికి వైద్యం చేయించడం ఎలా.. పిల్లలకు ఫీజులు ఎలా చెల్లించాలో అంటూ మనోవేదనకు గురవుతున్నారు.

మొండి వైఖరి విడనాడాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి. ఉపాధిని కోల్పోయిన వారిపై మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి. సీఎం చంద్రబాబు స్పందించి సిబ్బందికి ఉపాధి చూపించాలి.

– దేవరకొండ గురవయ్య, కంచికచర్ల

ప్రత్యామ్నాయం చూపాలి



నూతన మద్యం పాలసీ ప్రకారం తొలగించిన మాకు ప్రత్యామ్నాయం చూపించాలి. కొంతకాలంగా ప్రభుత్వానికి సేవలందించడంతో పాటు ఆదాయ వనరును కాపాడామన్న దృక్పథంతో చూడాలి. ఉద్యోగాలు కోల్పోయిన మాకు ప్రభుత్వం అండగా నిలవాలి.

– సంగీత అరుణ్‌కుమార్, కీసర

పరిహారం కోసం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ కార్యాలయాన్ని పలు గ్రామాల వరద బాధితులు మంగళవారం ముట్టడించారు. కొండపల్లి, మండల పరిధి గ్రామాల్లో వందలాది మందికి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు అన్యాయం చేశారని బాధితులు ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ, సీఐటీయూ, ఎంసీపీఐయూ నేతలు బాధితులకు సంఘీభావంగా నిలిచారు. వైఎస్సార్ సీపీ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే అనేకమంది వరద బాధితులకు నష్ట పరిహారం పంపిణీలో అన్యాయం జరిగిందని విమర్శించారు. మరోసారి అర్జీలు స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, కలకంటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వరదముంపు బాధితులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

మైలవరం సీఐ చంద్రశేఖర్

మైలవరం: సైబర్ నేరాలపై బ్యాంక్ మేనేజర్లు అప్రమత్తంగా ఉండాలని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌లో మైలవరం సర్కిల్ పరిధిలోని వివిధ బ్యాంక్‌ల మేనేజర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో సొమ్ము చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని, బ్యాంక్‌ల్లో వినియోగదారుల లావాదేవీలు నిర్వహించే సందర్భంలో కూలంకషంగా సమాచారం సేకరించి, తగు జాగ్రతలు తీసు కోవాలని సూచించారు. సమావేశంలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు అందజేత



చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామంలో మంగళవారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేసినట్లు నందిగామ వెటర్నరీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోజెష్ వెస్లీ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. నట్టల మందు వల్ల గొర్రెలు, మేకలకు మంచి ఆరోగ్యం ఏర్పడటమే కాకుండా వాటి పెరుగుదల సక్రమంగా ఉంటుందని చెప్పారు. నులిపురుగుల కారణంగా జీవాలు మందకొడిగా ఉంటూ ఆహారం తీసుకోవడం మానేస్తాయని అన్నారు. వాటిని ప్రాథమిక స్థాయిలోనే నివారించాలని సూచించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుద్దుకూరు వెంకటకృష్ణ, గ్రామ సంఘ అధ్యక్షుడు గోకర్ల మోహనరావు, చందర్లపాడు వెటర్నరీ డాక్టర్ జ్యోతి బాబు, ప్రతాప్ చంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు చింతోటి వీరప్రసాద్, గుడేటి శ్రీనివాసరావు, పశుపోషకులు పాల్గొన్నారు.